## గ్రామాలను దత్తత తీసుకోవాలి

- కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలతో మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): పరిశ్రమలు సామాజిక కర్తవ్యాన్ని, బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో ఆదివారం కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంపెనీలు తమవంతు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కో కంపెనీ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని సూచించారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సెర్ప్ సీఈవో దివ్య, ములుగు, ఆదిలాబాద్ కలెక్టర్లు దివాకర్, రాజర్షిషా పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గాడితప్పిన పాలన

- హామీలు అమలుచేయకుండా మోసగిస్తున్న కాంగ్రెస్ : కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా గాడి తప్పిందని, ఆర్థిక వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అనేక బోగస్ హామీలతో గద్దెనెక్కి 10 నెలలు గడుస్తున్నా.. ఒక్కటి అమలుచేయకుండా ప్రజలను మోసగిస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గ్యారెంటీలకు దిక్కు లేకుండా పోయిందని, సమస్యలను గాలికి వదిలి రూ.1.5 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. జన్వాడ రేవ్ పార్టీ నిజమో? కాదో? దర్యాప్తు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

## చిందు కళాకారుడు గడ్డం వెంకటయ్య మృతి

వెంకటయ్య(ఫైల్)

దేవరుప్పుల, అక్టోబర్ 27: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం వెంకటయ్య హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పద్మశ్రీ గడ్డం సమ్మయ్యకు సోదరుడైన వెంకటయ్య చిన్న వయస్సు నుంచి చిందుయక్ష గానంలో అనేక ప్రదర్శనలిచ్చి తనదైన శైలిలో రక్తి కట్టించేవారు. వెంకటయ్య మృతిపై పలువురు ప్రముఖులు, కళాకారులు సంతాపం తెలిపారు.

## ప్రముఖ వైద్యుడు బాపురెడ్డి కన్నుమూత

బాపురెడ్డి (ఫైల్)

ఖలీల్‌వాడి, అక్టోబర్ 27 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యుడు జాల బాపురెడ్డి (75) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో తుది శ్వాస విడిచారు. ఫిజిషియన్‌గా నాలుగు దశాబ్దాలకుపైగా వైద్య సేవలందించారు. పూర్వపు కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన బాపురెడ్డి.. టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడిగా ఉన్న బాపురెడ్డి ఎన్నికల సమయంలో బీజేపీలోకి వెళ్లారు. బీజేపీ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఐఎంఏలోనూ పలు పదవులు అలంకరించారు. డాక్టర్ బాపురెడ్డి మృతికి వైద్యులు, నాయకులు సంతాపం తెలిపారు.

## వరదకాలువలో వైద్యుడి గల్లంతు

### జగిత్యాల జిల్లాలో ఘటన

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 27: హనుమకొండకు చెందిన పాకంటి ఉదయ్‌కుమార్‌రెడ్డి(29) మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు దవాఖానలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. మరికొందరు వైద్యులతో కలిసి ఆదివారం రెండు కార్లలో మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు వెళ్లారు. అక్కడ దావత్ చేసుకొని తిరిగి వస్తూ మార్గమధ్యంలో విట్టంపేట వద్ద ఎస్సారెస్పీ వరదకాలువ వద్ద ఆగారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి, మరో వైద్యుడు ప్రశాంత్‌కుమార్ స్నానం చేసేందుకు వరదకాలువలో దూకగా ఉదయ్‌కుమార్‌రెడ్డి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయాడు. కొద్దిసేపటికి అతికష్టంపై ప్రశాంత్‌కుమార్ బయటకొచ్చాడు. గల్లంతైన వైద్యుని ఆచూకీ కోసం గాలింపు చేపట్టినట్టు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

# ఒక్క దూది పింజ కొంటే ఒట్టు

- 24 జిల్లాల్లోని కేంద్రాల్లో కొనుగోళ్లు సున్నా
- ఇదీ సీసీఐ, మార్కెటింగ్ శాఖ నిర్వాకం
- పత్తి రైతుల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): తేమ పేరుతో పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) చుక్కలు చూపిస్తున్నది. పత్తి కొనుగోళ్లు ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా... ఇప్పటివరకు 24 జిల్లాల్లో ఒక్క దూది పింజ కూడా కొనుగోలు చేయలేదు. తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతూ రైతుల నుంచి పత్తి కొనుగోలుకు నిరాకరిస్తున్నది. 'పరిస్థితులు, వాతావరణంతో మాకు సంబంధం లేదు.. నిబంధనల ప్రకారం ఉంటేనే కొనుగోలు చేస్తాం లేదంటే చేయం' అని కరాఖండిగా చెప్పేస్తున్నారు. ఈ విధంగా పత్తి రైతులను గోస పెడుతున్న సీసీఐ ఆగడాలను నిలువరించాల్సిన మార్కెటింగ్ శాఖ, ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఆరు జిల్లాల్లోనే కొనుగోలు

మార్కెటింగ్ శాఖ మొత్తం 322 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా, 20 రోజుల్లో 280 కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. ఇప్పటివరకు ఏకంగా 24 జిల్లాల్లో ఒక్క దూదిపింజ కూడా కొనుగోలు చేయలేదు. 6 జిల్లాల్లో మాత్రమే నామమాత్రంగా కొనుగోలు చేసింది. ఇందులోనూ కరీంనగర్ జిల్లాలో ఆరుగురు(6) రైతుల నుంచి 6.5 టన్నుల పత్తి కొనుగోలు చేయగా, వికారాబాద్ జిల్లాలో 8మంది రైతుల నుంచి 11టన్నుల పత్తిని కొనుగోలు చేసింది. ఈ నెల 24వరకు ఆరు జిల్లాల్లో మొత్తం 124 మంది రైతుల నుంచి రూ. 15 కోట్ల విలువైన 209 టన్నుల పత్తిని కొనుగోలు చేసింది. ఈ లెక్కన ఒక్కో రైతు నుంచి సగటున 1.68 టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. ఇక ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు కూడా కొనుగోలు డబ్బులు చెల్లించలేదు.

### తేమ పేరుతో చుక్కలు

ఈ సీజన్‌లో పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ, సీసీఐ రూపంలో చుక్కలు కనిపిస్తున్నాయి. మార్కెటింగ్ శాఖ అడగదు.. సీసీఐ ఇవ్వదు వెరసి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా తేమ పేరుతో రైతులను పెడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సీసీఐ నిబంధనల ప్రకారం 8-12శాతం పత్తి ఉండాలి. అలా అయితే సీసీఐ రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర ఇస్తుంది. కానీ వాతావరణ పరిస్థితులు బాగాలేకపోవడం, వర్షాలతో ప్రస్తుతం పత్తిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. అయినప్పటికీ ఏ మాత్రం వెసులుబాటు ఇవ్వకుండా నిబంధనల మేరకు తేమ శాతం ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. 12శాతం లోపు ఉంటే కొనుగోలు చేస్తాం లేకుండా చేయబోం అంటూ స్పష్టం చేస్తున్నారు. దీంతో రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటను తిరిగి తీసుకెళ్తున్నారు. సరే ఆరబెట్టి మళ్లీ సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకొద్దామని భావించినా... తుఫాను హెచ్చరికలు, ఎప్పుడు కురుస్తుందో తెలియని వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తీరా వర్షం కురిస్తే అసలుకే మోసం వస్తుందని భయపడి తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు కట్టబెడుతున్నారు. ఈ విధంగా పత్తి రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పత్తి కొనుగోలు చేయని జిల్లాలు..

ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ , భూపాలపల్లి, గద్వాల్, జగిత్యాల, జనగాం, కామారెడ్డి, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్‌కర్నూల్, నల్గొండ, నిర్మల్, పెద్దపల్లి, రంగారెడ్డి , సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి, భువనగిరి.

**పత్తి కొనుగోలు చేసిన జిల్లాలు... వివరాలు**

| జిల్లా | రైతుల సంఖ్య | పత్తి కొనుగోలు |
|---|---|---|
| కరీంనగర్ | 06 | 06 |
| వికారాబాద్ | 08 | 11 |
| ఖమ్మం | 12 | 35 |
| వరంగల్ | 22 | 37 |
| నారాయణపేట్ | 38 | 64 |
| మహబూబ్‌నగర్ | 38 | 56 |
| మొత్తం | 124 | 209 |

## దిగుబడి రాక పత్తిరైతు లబోదిబో

- రోటవేటర్‌తోఎకరంన్నర చేను దున్నేసిన రైతు

నర్సింహులపేట, అక్టోబర్ 27: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రాములుతండాకు చెందిన రైతు జాటోత్ సురేశ్ ఆరుగాలం కష్టపడి పత్తి సాగు చేస్తే పంట చేతికి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. ఎకరానికి కేవలం 2-3 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీనికితోడు సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి ఎర్రబారి తీవ్ర నష్టం జరగడంతో మార్కెట్లో ధర తక్కువగా ఉంది. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెడితే రూ.15 వేలు కూడా వచ్చే అవకాశం కూడా లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. రెండున్నర ఎకరాలు పత్తి సాగు చేయగా ఇందులో ఎకరంన్నర కౌలుకు తీసుకున్నాడు. ఇప్పటి వరకు రెండున్నర ఎకరాల్లో 5 క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చింది. చేను ఎండిపోతుండటంతో ఆదివారం రోటవేటర్‌తో ఎకరంన్నర పత్తి దున్నేశాడు.

## జగ్గారెడ్డిని కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

- మహిళా కలెక్టర్‌ను అవమానించడం దారుణం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): మహిళా కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగ్గారెడ్డిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలపై మహిళా కమిషన్, ఐఏఎస్ సంఘాలు, మహిళా సంఘాలు కూడా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగ్గారెడ్డి అణగారిన వర్గానికి చెందిన మహిళా కలెక్టర్‌ను అవమానించడమే కాకుండా ప్రెస్‌మీట్ పెట్టి మూడేండ్ల క్రితం నాటిదని చెప్పుకోవడానికి సిగ్గుండాలని మండిపడ్డారు. మూడేండ్ల క్రితం సంగారెడ్డి జిల్లాకు మహిళా కలెక్టర్ రాలేదని, మూడు నెలల క్రితమే ఆయన ఈ అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. కలెక్టర్‌ను తిట్టానని స్వయంగా జగ్గారెడ్డే బహిరంగసభలో చెప్పుకున్నారంటే, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఐఏఎస్ అధికారులను, మహిళలను అలాగే తిట్టాలని ప్రోత్సహించినట్టే కదా! అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఉన్నవారిని బట్టలు విప్పి కొడతానని వ్యాఖ్యానించడం ద్వారా జగ్గారెడ్డి మహిళలను మరోసారి అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### శంకర్‌పై కేసుకు ఆధారాలేమిటి?

జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఎక్స్‌లో పోస్ట్ చేసినందుకు జర్నలిస్ట్ శంకర్ మీద ఏ ఆధారంతో కేసు నమోదు చేశారని సతీశ్‌రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. వీడియో మూడేండ్ల కిందటిదని పోలీసులు ఎలా ధ్రువీకరించారని, దీనిపై డీజీపీ, సంగారెడ్డి ఎస్పీ, సీఐ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులు పెట్టిన అధికారులను వదిలిపెట్టేదిలేదని, వారు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వాస్తవాలే మాట్లాడుతున్నదని, కేసీఆర్, కేటీఆర్ ఏనాడూ ఫేక్ వార్తలు, మార్ఫింగ్ చేయాలని నేర్పలేదని పేర్కొన్నారు.

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలిలో వాపసు వచ్చిన సోయా బ్యాగును కాంటాపై ఉంచి రోడ్డుపై బైఠాయించిన రైతులు

## సోయా వాపస్‌పై రైతుల ఆందోళన

- కొన్న తరువాత తిప్పి పంపడమేంటి?
- కొనేటప్పుడు 51 కిలోల కాంటా
- తిరిగిచ్చేటప్పుడు 45 కిలోలా?
- నిర్వాహకుల తీరుపై రోడ్డుపై బైఠాయింపు

పోతంగల్, అక్టోబర్ 27: కొనుగోలు చేసిన సోయా పంటను తిరిగి వాపస్ ఇవ్వడంపై రైతులు భగ్గుమన్నారు. అదీగాక కొనేటప్పుడు 51 కిలోలు కాంటా పెట్టి.. తిరిగి ఇచ్చేటప్పుడు 45 కిలోల బస్తా ఇవ్వడంతో ఆందోళనకు దిగారు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలి కొనుగోలు కేంద్రంలో రైతులు సోయాను విక్రయించారు. సగం ధాన్యం వాపసు వచ్చిందని, పదిమందికి చెందిన 102 సోయా బ్యాగులను తీసుకెళ్లాలని సొసైటీ అధికారులు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యం బాగోలేదని అంటున్నారని రైతు భగ్గుమన్నారు. తేమ శాతం చూసిన తరువాతే కొనుగోలు చేసిన ధాన్యం ఇప్పుడు బాగోలేదని వాపసు పంపడమేంటని మండిపడుతూ రోడ్డుపై బైఠాయించారు. వాపసు పంపిన ధాన్యాన్ని అధికారులే పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# గుర్తింపులేని కాలేజీలు 235

- సగం విద్యాసంవత్సరం గడిచినా చర్యలు శూన్యం
- అగమ్యగోచరంగా 50వేలకు పైగా విద్యార్థుల భవిష్యత్తు

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 235 ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ఇంటర్‌బోర్డు గుర్తింపు లేకుండా నడుస్తున్నాయి. విద్యార్థుల నుంచి అడ్మిషన్లు సైతం తీసుకున్నాయి. మొత్తం కాలేజీల్లో 25శాతం కాలేజీలు ఇప్పటి వరకు గుర్తింపును దక్కించుకోలేకపోయాయి. సగం విద్యాసంవత్సరం ముగిసినా వాటిపై చర్యలు తీసుకోవడంలో ఇంటర్‌బోర్డు మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల గడువు 20తో ముగిసింది. నేడో, రేపో ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్ సైతం విడుదలకానుంది. గుర్తింపు ఉన్న కాలేజీల్లోని విద్యార్థుల నుంచే పరీక్ష ఫీజులు తీసుకుంటారు. దీంతో ఈ కాలేజీల్లో చదువుతున్న 50వేలకు పైగా విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే గుర్తింపు లేని కాలేజీలు అత్యధికంగా ఉన్నా వీటిని నియంత్రించలేకపోతున్నది. కనీసం ఈ కాలేజీలకు నోటీసులు కూడా జారీచేయలేదంటే బోర్డు అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

# 'కొడంగల్'కు సీవోటీ మెలిక

- టెండర్ల ప్రక్రియ సజావుగా సాగినట్టు హామీ ఇస్తేనే ఆమోదిస్తామని షరతు
- అందులో మర్మమేంటని ఇరిగేషన్‌శాఖలో తీవ్ర చర్చ
- వివాదాలను తప్పించుకునేందు కేనంటూ ఇంజినీర్ల గుసగుస

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్‌ఐఎస్) ఆది నుంచీ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇప్పుడు ఆ పథకానికి ఆమోదముద్ర వేసేందుకు కమిటీ ఆఫ్ టెండర్స్(సీవోటీ) షరతులు విధించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకే జరిగిందని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని, అప్పుడే ఆమోదం తెలుపుతామని సీవోటీ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తినా సులభంగా తప్పించుకునేందుకు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకే ఈ షరతు విధించినట్టు తెలిసింది. గతంలో ఎప్పుడూ, ఏ ప్రాజెక్టు టెండర్లకూ లేనివిధంగా సీవోటీ షరతు విధించడంపై ఇంజినీర్లు నానావిధాలుగా చర్చించుకుంటున్నారు.

### ఎన్నడూ లేనివిధంగా సీవోటీ మెలిక

నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాల కోసం 2 ప్యాకేజీలుగా ఎన్‌కేఎల్‌ఐఎస్ పనులను చేపట్టాలని నిర్ణయించింది. మొదటి ప్యాకేజీకి రూ.1,134.62 కోట్లు, రెండో ప్యాకేజీ పనులకు రూ.1,126.23 కోట్లు అవసరమవుతాయన్న అంచనాతో ఇటీవల టెండర్లను ఆహ్వానించడంతో ఎన్‌సీసీ, ఎల్‌అండ్‌టీ, మేఘా, రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీలు టెక్నికల్ బిడ్లు దాఖలు చేశాయి. వారం రోజుల క్రితం తెరిచిన ఆ బిడ్లలో 4 కంపెనీలూ అర్హత సాధించాయి. దీంతో తాజాగా ప్రైస్ బిడ్లను తెరిచారు. వాటిలో ఎన్‌సీసీ, ఎల్ అండ్‌టీ బిడ్లు అర్హత సాధించలేదని ప్రకటించిన అధికారులు.. చివరికి మొదటి ప్యాకేజ్ పనులను మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి, 2వ ప్యాకేజీ పనులను మేఘా కంపెనీకి కట్టబెట్టారు. ఆ రెండు కంపెనీలు అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికంగా కోట్ చేయడం కొసమెరుపు. ఆపై సదరు టెండర్ల ప్రక్రియ సజావుగా కొనసాగిందా? లేదా? సాంకేతిక అంశాలను పరిశీలించారా? లేదా? అనే అంశాలను పరిశీలించిన అధికారులు.. ఇటీవల ఆ టెండర్లను తుది ఆమోదం కోసం సీవోటీకి పంపించారు. కానీ, టెండర్లను ఆమోదించిందీ? లేనిదీ ఇప్పటివరకూ అటు ఇరిగేషన్ అధికారులు గానీ, ఇటు సీవోటీ వర్గాలు గానీ ఖరారు చేయలేదు.

### ముందస్తు జాగ్రత్త కోసమే

టెండర్ల ప్రక్రియపై ఆదినుంచీ అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. మేఘా, రాఘవ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టేందుకే టెక్నికల్ ఎవాల్యూయేషన్‌ను సరిగా నిర్వహించలేదని, మిగిలిన రెండు కంపెనీలను ఉద్దేశపూర్వకంగానే తప్పించారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి టెక్నికల్ ఎవాల్యూయేషన్ చేసేటప్పుడు ఆయా కంపెనీల ట్రాక్ రికార్డును పరిశీలిస్తారు. గతంలో కంపెనీ చేపట్టిన నిర్మాణాలు, వాటిలో తలెత్తిన వైఫల్యాలు, ప్రమాదాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఎన్‌కేఎల్‌ఐఎస్ టెండర్ల విషయంలోనూ ఇదే పద్ధతిని పాటించి ఉంటే టెక్నికల్‌గా మేఘా కంపెనీ అర్హత సాధించే అవకాశమే లేదని, ఆ కంపెనీ బిడ్‌ను ప్రాథమికంగానే తిరస్కరించాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆ కంపెనీ నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టులో ఇటీవల భారీ ప్రమాదం సంభవించడమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. అయినప్పటికీ ప్రస్తుతం ఎన్‌కేఎల్‌ఐఎస్ టెండర్ల ఖరారులో సుంకిశాల ప్రమాద ఘటనను పరిగణనలోకి తీసుకోలేదని, 2వ ప్యాకేజీ పనులను మేఘా కంపెనీకి కట్టబెట్టేందుకు టెక్నికల్ ఎవాల్యూయేషన్ నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుంకిశాల ఘటనను పరిగణనలోకి తీసుకుంటే ఎన్‌కేఎల్‌ఐఎస్ టెండర్ ఎట్టిపరిస్థితుల్లోనూ మేఘాకు దక్కే అవకాశమే లేదని, టెక్నికల్‌గానే ఆ కంపెనీ టెండర్‌ను డిస్‌క్వాలిఫై చేయాల్సి ఉంటుందని ఇంజినీర్లు చెప్తున్నారు. ఇదిలావుంటే, ఆయా పనులను దక్కించుకునేందుకు రాఘవ కన్‌స్ట్రక్షన్, మేఘా కంపెనీలు దాఖలు చేసిన కొటేషన్లను చూస్తే లోపాయికారీగా ఒప్పందం చేసుకున్నట్టు స్పష్టమవుతున్నది. ప్యాకేజీ-1 పనుల కోసం రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేయగా, ప్యాకేజీ-2 పనుల కోసం మేఘా ఇంజినీరింగ్ కంపెనీ 4.85% అధికంగా కోట్ చేసింది. మొత్తంగా మేఘా కంపెనీ అధికంగా కోట్ చేసిన చోట రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తక్కువకు, మేఘా కంపెనీ తక్కువ కోట్ చేసిన చోట రాఘవ కంపెనీ అధికంగా కోట్ చేయడం గమనార్హం.

సదర్ సమ్మేళనంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

## ఇక నుంచి అధికారికంగా సదర్

### ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబర్ 27 : ఇక నుంచి ప్రతి సంవత్సరం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిపార్క్ ధర్నా చౌక్ వద్ద యాదవ్ సదర్ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. సదర్ సమ్మేళనాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో యాదవులకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

## రాజకీయాల కోసమే విచారణ కమిషన్లు..!

- పొలిటికల్ గేమ్‌లో భాగంగానే సాగదీత
- ఇటీవల పొంగులేటి మాటలతో తేటతెల్లం

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): దీపావళికి ముందే బాంబులు పేలుతాయంటూ ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్లు సైతం రాజకీయ దురుద్దేశాలతోనేనని తేలిపోతున్నది. వేగవంతంగా విచారణ కొనసాగిస్తామని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం నెలల పాటు సాగదీస్తున్నదని రాజకీయ విశ్లేషకులు నొక్కిచెబుతున్నారు. విచారణ దశలోనే ఆయా అంశాలపై రాజకీయ విషప్రచారానికి పూనుకోవడం ఇందులో భాగమేనని స్పష్టం చేస్తున్నారు. భవిష్యత్ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం సాగదీస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు కాళేశ్వరం, విద్యుత్ కమిషన్ల విచారణ తీరునే ఉదాహరిస్తున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణ కోసం ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 100 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కానీ ఇప్పటికీ విచారణ కొలిక్కిరాలేదు. ఇదిలా ఉంటే కమిషన్ విచారణ గడువును ఇప్పటికే పలుసార్లు పొడగించారు. ఆ గడువు సైతం ఈ నెల 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరోసారి పొడగించక తప్పని పరిస్థితి. గడువు పెంపునకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు అధికారవర్గాలు సైతం వెల్లడిస్తున్నాయి. మరోవైపు విద్యుత్ కొనుగోళ్ల అంశంపై విచారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ సైతం ఇదే రీతిగా కొనసాగుతున్నది. అదీగాక ఆ కమిషన్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ నర్సింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కోర్టులో పిటిషన్ దాఖలు కావడం, దీంతో ఆయనను సుప్రీంకోర్టు తప్పించి మరొకరిని విచారణ కోసం నియమించడం తెలిసిందే. ఈ ఉదంతం కూడా రాజకీయ దురుద్దేశాలతోనే కమిషన్ల ఏర్పాటు జరిగిందని గతంలోనే చర్చ జరిగింది. అయితే తాజాగా మంత్రి పొంగులేటి వ్యాఖ్యలతో అది మరింత బలోపేతమవుతున్నది. కమిషన్ల పేరిట బీఆర్ఎస్‌ను, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్రకు ప్రభుత్వం పన్నాగం పన్నుతున్నదని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

## మాడల్ స్కూళ్లల్లో వసతుల్లేక

- అసంపూర్తి పనులతో బడులు ఆగమాగం
- తక్షణమే రూ. 238 కోట్లు విడుదల చేయండి
- ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదనలు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): మాడల్ స్కూళ్లు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. తరగతి గదులు లేక, భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా కోటి రూపాయల వరకు విద్యుత్తు బిల్లుల బకాయిలున్నాయి. 170 మాడల్ స్కూళ్లలోని బాలికల హాస్టళ్లలో సైతం తరగతి గదుల కొరత, నిర్వహణ సమస్యలు వేధిస్తున్నాయి. ఇలా రాష్ట్రంలోని ప్రతి మాడల్ స్కూల్‌లో ఏదో ఒక సమస్య ఉన్నది. దీంతో స్కూళ్లల్లో సివిల్ వర్క్స్, పెండింగ్ పనులు చేపట్టేందుకు రూ. 238 కోట్లు విడుదల చేయాలని విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. నిధులు మంజూరు చేస్తేనే స్కూళ్లల్లో సమస్యలు తీరుతాయని నివేదికలో ప్రస్తావించింది.

### నిధులిచ్చి బలోపేతం చేయాలి

మాడల్ స్కూల్స్ లో గ్రామీణ నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంగ్లిష్ మీడియం చదువులను అందిపుచ్చుకుని ఎంతో మంది విద్యార్థులు ప్రయోజకులయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కూళ్లకు నిధులిచ్చి బలోపేతం చేయాలి. ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తిస్థాయి వసతులు కల్పించాలి. హాస్టల్ సీట్లను పెంచాలి. ఉచిత విద్యుత్తును ఇవ్వడం సంతోషం. అయితే పెండింగ్ విద్యుత్తు బకాయిలను ప్రభుత్వం మాఫీ చేయాలి.

- యాకమల్లు, టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 2.45,6.30,9.45
ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 8.15PM
PVR ఆర్.కె.-బంజారాహిల్స్ 2.00PM
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.25,8.05PM
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 12.45,7.20PM
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 10.30,2.10,8.00
PVR గలేరియా - పంజాగుట్ట 2.05,11.00PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.05,7.40PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 1.00,7.35PM
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి 2.00PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 1.50,8.00PM
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 1.55,7.35PM
Cinepolis లులు మాల్ - కూకట్‌పల్లి 5.35PM
CCPL - మల్కాజ్‌గిరి 5.25PM
డి.ఎల్.ఎఫ్ - ఉప్పల్ 5.10PM
మంత్రామాల్ - అత్తాపూర్ 2.15PM
ఐనాక్స్ - బంజారాహిల్స్ 11.30,7.50PM
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 2.10,7.50PM
ఎం.పి.మాల్ - కాచిగూడ 1.55PM
సత్యనారాయణ మాల్ - కూకట్‌పల్లి 1.15,7.30PM
అశోక - వై.జంక్షన్ 5.00,10.40PM
మిరాజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 3.40PM
మిరాజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 1.00PM
మిరాజ్ సినిమాస్ - చందానగర్ 3.40PM
లక్ష్మీనరసింహ - మియాపూర్ 10.50PM
MOVIETIME ప్లాటినమ్ ఎ/సి - గచ్చిబౌలి 4.30PM
AMB ఏఎంబి - గచ్చిబౌలి 10.15,4.25,7.35,10.30
ఏఏఏ - అమీర్‌పేట్ 1.15,7.35PM
ASIAN సినీ స్క్వేర్ - ఉప్పల్ 1.30,7.30PM
ఎం.జె.ఆర్ ఎ/సి - నారపల్లి 4.25PM
సినీప్లానెట్ - కొంపల్లి 1.20,10.30PM
సినీమార్క్ - ఆర్.సి.పురం 1.45,7.40PM
అపర్ణ - నల్లగండ్ల 2.00,4.50PM
జెపి - చందానగర్ 4.40,10.35PM
ఎస్2 సినిమాస్-వరంగల్, జెమిని కాంప్లెక్స్ - వరంగల్, ముక్తా ఎ2శ్రీనివాస - కరీంనగర్, ఎవిడి - మహబూబ్‌నగర్, శ్రీరామ - సుల్తానాబాద్, యస్ఆర్‌శ్రీనివాస - మంథని, పివిఆర్ వేణు - నిజామాబాద్, గీతాప్రసాద్ - నిజామాబాద్, విట్రోస్ - మిర్యాలగూడ, SVC జెమిని - మంచిర్యాల, SVC ప్రతిమా - కరీంనగర్, SVC మల్టిప్లెక్స్ - గద్వాల్, పివిఆర్ సినిమా - ఆర్మూర్, మిరజ్‌సినిమాస్ - రాయచూర్